ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 15 మే 2024



ఫసల్ బీమా సొమ్ము రైతు ఖాతాల్లో జమ చేయాలి

రాయచూరు, మే 14 : జిల్లాలోని దేవదుర్గ తాలూకా పలకనమరడి గ్రామ పంచాయతీ వందలి గ్రామ రైతులకు ఫసల్ బీమా సొమ్మును అందజేయాలని గ్రామస్థులు కోరారు. మంగళవారం జిల్లా అధికారిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. గత ఏడాది వందలి గ్రామ రైతులు ఫసల్ బీమా ద్వారా పేర్లను నమోదు చేసుకుని బీమా సొమ్మును కూడా చెల్లించారు. ప్రభుత్వం తాలూకాను కరువు పీడిత ప్రాంతంగా గుర్తించిన నేపథ్యంలో సాంకేతిక కారణాల వల్ల ఫసల్ బీమా సొమ్ము అందే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. జిల్లా అధికారి చొరవ తీసుకుని రైతులను ఫసల్ బీమా సొమ్ము చెల్లించి ఆదుకోవాలన్నారు.

తొలకరి పులకరింపు

- రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు
- ఆశాజనకంగా సాగు పనులు
- అన్నదాతల ఆనందం



బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మూడు నెలలపాటు మండుటెండలతో సాగిన వేసవి చల్లబడింది. వారం రోజులుగా జిల్లాలవారీగా వర్షాలు కురుస్తున్నాయి. మే నెల రెండో వారంలోనే తొలకరి వానలు సంతృప్తికరంగా ఉండడంతో అన్నదాతలు పులకరిస్తున్నారు. వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడంతో సాగుపనులు చేసేందుకు సిద్ధమయ్యారు. నాగలిపట్టి దుక్కులు దున్నుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా ఖరీఫ్ సీజన్‌లో 80లక్షలకు పైగా హెక్టార్లలో పంటలసాగు జరుగుతుంది. గత ఏడాది జూలై వరకు ఆశించినంతగా వర్షాలు కురవకపోవడంతో రైతులు డీలా పడ్డారు. ఆలస్యమైనా ఫర్వాలేదని విత్తన పనులు ప్రారంభించినా ఆ తర్వాత వరుణుడు కరుణ చూపకపోవడంతో పైర్ల దశలోనే పంటలు ఎండిపోయాయి. గత నాలుగైదు దశాబ్దాలకాలంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో కరువు విలయతాండవం చేసింది. 236 తాలూకాలు కలిగిన రాష్ట్రంలో ఏకంగా 223 తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. మిగిలిన తాలూకాలు నగర ప్రాంతాలుగా ఉన్నాయి. రాష్ట్రమంతటా కరువు నెలకొంది. పంటలు పండకపోవడంతో రైతులు ఉపాధి కూలీలుగా మారడంతోపాటు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ముంబై, గోవా నగరాలకు వలస కూలీలుగా వెళ్లారు. ఎక్కువ మంది పశువులను మార్కెట్‌లో విక్రయించుకున్నారు. మే నెల మొదటివారం దాకా ఎండలు తారస్థాయిలో మండాయి. 40-44 డిగ్రీలకుపైగా రాష్ట్రమంతటా భానుడు ప్రతాపం చూపాడు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణంలో మార్పు వచ్చింది. తొలి రెండు రోజులు కురిసిన వర్షానికి బీటలుబారిన భూములలో కొత్తశక్తి వచ్చినట్టు అయింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లోనూ వర్షాలు కురుస్తున్నాయి. సాధారణంగా మే చివరన జూన్ ప్రారంభంలో నైరుతి రుతుపవనాల ప్రభావం ఉంటుంది. అంతకంటే ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో అన్నివర్గాల ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. పల్లె ప్రాంతాల్లో వానలు కురుస్తుండడంతో ఎనలేని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానపంటలు సాగు చేసే రైతులు అప్పుడే పొలం పనులలో నిమగ్నమయ్యారు. పాదులు చేయడంతోపాటు వర్షపునీరు పొలం నుంచి బయటకు పోకుండా కట్టడి చేసే పనులు కొనసాగిస్తున్నారు. ఇక ఖరీఫ్‌లో పంటసాగుకు మరో మూడువారాలకుపైగా సమయం ఉన్నా ముందుగా దుక్కులు చేసుకోవడం ద్వారా మట్టి సారవంతమవుతుందని, పలు లాభాలు ఉంటాయని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా పొలం దున్నే పనులకు సిద్ధమయ్యారు. సొంతంగా ఎద్దులు లేనివారు ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. ఒక్కసారిగా ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది. రాష్ట్రంలో రెండు విడతల లోక్‌సభ ఎన్నికలు సాగడంతో ప్రతిచోటా ప్రజలు రాజకీయాలవైపు మొగ్గు చూపారు. ఎన్నికలు ముగియడం అంతలోనే వర్షాలు కురుస్తుండడంతో రైతు కుటుంబాలంతా పొలంబాట పట్టారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉంటాయనే అభిప్రాయాలతో మరింత ఉత్సాహం నెలకొంది.


పొలం దున్నుతున్న రైతు

గత సంవత్సరం వ్యవసాయ సంక్షోభంతో తల్లడిల్లిపోయిన అన్నదాతకు ఈసారి మే నెలలోనే తొలకరి పలకరించడంతో పులకరించిపోతున్నాడు. సేద్యం పనులకు సిద్ధమవుతున్నాడు. వర్షాలు పడుతుండడంతో ముందుగానే దుక్కులు దున్నితే భూమి సారవంతమవుతుందని పనులు చేపట్టాడు. గత ఏడాది తీవ్రమైన కరువు నెలకొనడంతో పశువులకు మేత, నీళ్లకు కటకటలాడే పరిస్థితులు దాపురించాయి. చాలా మంది రైతులు తమ పశువులను అమ్మేశారు. ప్రస్తుతం పశువులు కరువై వ్యవసాయ పనులకు ట్రాక్టర్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

మేమంతా కలిసే ఉన్నాం

- బీజేపీ నేతలూ.. మీకు చింత వద్దు
- ఐదేళ్లూ సురక్షిత పాలన అందిస్తాం : సీఎం

బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీలో అంతర్గత విభేదాలు లేవని, అలా ఉంటే లోక్‌సభ ఎన్నికల్లో కలసి పనిచేయడం సాధ్యమయ్యేది కాదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. మైసూరులో మంగళవారం సీఎం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు ఉన్నాయని, ప్రభుత్వం కూలిపోతుందనే బీజేపీ నాయకుల వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. బీజేపీ కేవలం కలుషిత రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పరిషత్ ఎన్నికల్లోనూ వాతావరణం ఉత్తమంగా ఉందని, ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుస్తామన్నారు. ఆరు నెలలక్రితమే అభ్యర్థులను ఎంపిక చేయడం వల్ల వారికి తగిన సమయం లభించిందన్నారు. బీజేపీ - జేడీఎస్‌ల మైత్రి పనిచేయదని పేర్కొన్నారు. ప్రజ్వల్ రేవణ్ణ పెన్‌డ్రైవ్ అంశం లోక్‌సభ ఎన్నికల్లో ప్రభావం చూపిందా అనే ప్రశ్నకు బదులిస్తూ ప్రజలు బుద్ధివంతులని, కేంద్రప్రభుత్వ సాధనలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ పనితీరును గమనిస్తారని అన్నారు. రాజకీయంగా ఎలా వ్యవహరించారనేది ప్రజలకు అర్థమయిందన్నారు. కుమారస్వామి వద్ద పెన్‌డ్రైవ్ ఉందని బెదరించడం కాదని, ఆయన ఎప్పుడు హిట్ అండ్ రన్ చేస్తారని కొట్టిపారేశారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం భద్రంగా ఉందని, ఐదేళ్ల పాలన విజయవంతం చేస్తామన్నారు. మీ పార్టీ గురించి ఆలోచించుకోవాలని టిక్కెట్లు దక్కని ఎంతోమంది బీజేపీ నేతలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను తొలగించాలనే వ్యూహరచనలో పేర్కొన్నారు. తండ్రీ కొడుకులకు చెడ్డపేరు తీసుకొచ్చి పక్కన పెట్టాలని భావిస్తున్నారని, ఆ వర్గానికి ఆర్ఎస్ఎస్ ఆశీస్సులు ఉన్నాయన్నారు. లోక్‌సభ టిక్కెట్లు దక్కనివారు ఎన్నికల్లో క్రియాశీలకంగా పాల్గొనలేదన్నారు. వారంతా ఓ కూటమిగా ఏర్పడి బీజేపీలో గ్రూపు విభేదాలు తలెత్తనున్నాయని తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వానికి ఢోకా లేదన్నారు.


మైసూరులో నామినేషన్ల వేళ సీఎం సిద్దరామయ్య తదితరులు


అంకితకు రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న డీసీఎం డీకే శివకుమార్

ఎస్ఎస్ఎల్‌సీ టాపర్లకు సన్మానం

- అభినందించిన సీఎం, డీసీఎం
- ప్రోత్సాహకం అందించిన డీకే శివకుమార్


విద్యార్థులను అభినందిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ స్టేట్ టాపర్లను ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఫలితాలు వెలువడిన రోజునే తొలిస్థానంలో నిలిచిన అంకితా, నవనీత్ అనే విద్యార్థులకు ఫోన్ చేసి డీసీఎం శుభాకాంక్షలు తెలిపారు. బెంగళూరుకు వచ్చి భేటీ కావాలని సూచించారు. అందుకు అనుగుణంగానే బాగల్కోటె జిల్లా ముధోళ నుంచి తల్లిదండ్రులతోపాటు అంకితా బసప్ప కొన్నూరు మంగళవారం డీసీఎం డీకే శివకుమార్‌ను ఆయన నివాసంలో కలిశారు. విద్యార్థినిని అభినందించిన డీసీఎం రూ.5లక్షల చెక్కు అందించారు. మూడో ర్యాంకు సాధించిన మండ్యకు చెందిన నవనీత్‌కు రూ.2లక్షల ప్రోత్సాహక ధనాన్ని అందించారు. ఈ సందర్భంగా డీసీఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాగల్కోటె జిల్లా ముధోళ నివాసి బసవరాజ్ కుమార్తె అంకిత 625 మార్కులకు సంపూర్ణంగా సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సమర్థవంతులైనవారు ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమన్నారు. విద్యాభ్యాసం కొనసాగించేందుకు రూ.5లక్షలు ఇచ్చానని, భవిష్యత్తులో వారికి అండగా ఉంటానని పేర్కొన్నారు. నవనీత్ కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థి అన్నారు. రాజకీయాలంటే తనకు ఆసక్తి అయినా, తాను ఎంచుకునేది విద్యారంగమని, అందుకే గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేర్చాలన్నది తన సంకల్పమన్నారు. రామనగర జిల్లాలో 20 పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీరుస్తున్నామని పేర్కొన్నారు. మైసూరులో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్పను ఉత్తమ విద్యార్థులు భేటీ అయ్యారు. ఇదే సందర్భంగా అంకిత, నవనీత్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. రెసిడెన్షియల్ స్కూల్స్ కార్యనిర్వాహక అధికారి ప్రవీణ్‌బాగేవాడి, జాయింట్ డైరెక్టర్ నాగేశ్, అసిస్టెంట్ డైరెక్టర్ హొన్నరాజు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు మైసూరులో ఉన్న ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిశారు. ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించి సన్మానించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

వేసవి సెలవులపై వేటు



- గడువుకు ముందే తెరుచుకుంటున్న పాఠశాలలు
- కమిషన్‌కు తల్లిదండ్రుల సమన్వయ సమితి ఫిర్యాదు



బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పిల్లల వేసవి సెలవులకు వేటు పడింది. సెలవులు ఇంకా నెల రోజులు ఉన్నట్టే ప్రతిష్ఠాత్మకమైన ప్రైవేట్ విద్యాసంస్థలు తరగతులు ప్రారంభించడం ద్వారా పిల్లల వేసవి సెలవులను హరించేశాయి. కొన్ని రోజుల ముందే పాఠశాలలను ప్రారంభించి విద్యార్థులను పంపాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. తొమ్మిదో తరగతి పరీక్షలు రాసి పదో తరగతిలో ప్రవేశించేవారి తల్లిదండ్రులు మౌనంగా ఉన్నా ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం సమన్వయ సమితికి ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదులకు అనుగుణంగా రాష్ట్ర బాలల హక్కుల రక్షణా కమిషన్‌కు తల్లిదండ్రుల సమన్వయ కమిటీ వినతిని ఇచ్చింది. విద్యార్థుల వేసవి సెలవులను హరించేసేలా వ్యవహరించిన తీరుపై మండిపడ్డారు. న్యాయబద్ధంగా పిల్లలకు లభించాల్సిన వేసవి సెలవులను రద్దు చేసిన సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పాఠ్యాంశాల ఆధారంగా సాగే విద్యాసంవత్సరం ఏప్రిల్ రెండో వారంలో ముగిసింది. ఏప్రిల్ 11నుంచి మే 28వరకు వేసవి సెలవులను ప్రకటించారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ విద్యాసంస్థలు ఏప్రిల్ 11నుంచి మే 26వరకు సెలవులు ఇచ్చాయి. అన్ని పాఠశాలలు మే చివరి వారంలో ప్రారంభం కావాల్సి ఉండేది. కానీ ఏప్రిల్ చివరివారం నుంచే పలు విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. వేసవి సెలవులు కేవలం వారం రోజులకే ముగించేశారు. రాష్ట్రంలో 17,109 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా 47.02 లక్షలమంది విద్యార్థులు చదువుతున్నారు. సాధారణంగా ప్రైవేట్ విద్యాసంస్థలలో పదో తరగతి విద్యార్థులకు త్వరగా తరగతులను ప్రారంభిస్తారు. పబ్లిక్ పరీక్షలు ఉంటాయని, ఎక్కువ మార్కులు సాధించే దిశగా ముందుగా విద్యార్థులను సిద్ధం చేస్తారు. ఇదే క్రమంలోనే పలు పాఠశాలల్లో తరగతులను ప్రారంభించారు. కానీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏం అవసరం ఉందని రప్పిస్తున్నారనేది ప్రశ్నగా మారింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సరదాగా గడుపుతుంటే ప్రైవేట్ పాఠశాలల్లో చదివేవారు మాత్రం అప్పుడే బ్యాగులు తగిలేసుకుని లంచ్‌బాక్స్‌లతో పరుగులు తీస్తున్నారు.

ముందస్తుగా ఎందుకో..?

ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఇతర సంస్థల్లో చేరుతారనే ఉద్దేశ్యంతో ముందస్తుగానే అడ్మిషన్లు ప్రారంభిస్తారు. పాఠశాలలు మారతారనే ఆందోళన ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థ నిర్వాహకుల్లో ఉంటుంది. అందుకే ప్రధానంగా 1, 3, 5, 7, 8 తరగతుల క్లాస్ టీచర్లకు టార్గెట్ ఇచ్చి ఒక్క విద్యార్థి కూడా బయటపోకుండా చూడాలని నిబంధన విధిస్తారు. అందుకే వారు వేసవి సెలవులను వదులుకుని ముందుగా అడ్మిషన్లు చేస్తుంటారు. ఇందుకు అనుగుణంగానే ముందస్తుగా ఫీజులు వసూలు చేసుకుంటే విద్యార్థులు బయటకు వెళ్లరని, తరగతులకు అనుగుణంగా సంఖ్య నిర్ణయించుకునేందుకు ఇది అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.

పిల్లలకు సరదా కరువు..!

రాష్ట్రంలో పిల్లలకు ఈ ఏడాది సరదా కరువైంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు నెలన్నర కాలంగా 35-40కు పైగా డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వృద్ధులు, పిల్లలు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఇక లోక్‌సభ ఎన్నికలు ఉండడంతో లక్షలాది మంది ఉద్యోగులు ఎన్నికల విధులలో పాల్గొన్నారు. మే 7వ తేదీతో రాష్ట్రంలో రెండు విడతల ఎన్నికలు ముగిశాయి. నాలుగైదు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. సరదాగా పిల్లలతో విహారయాత్రకు వెళ్దామని భావిస్తున్న ఉద్యోగులకు విద్యాశాఖ షాక్ ఇచ్చింది. తరగతులు ప్రారంభించడంతో పిల్లలతో కలసి బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఉద్యోగులలో 95 శాతానికిపైగానే పిల్లలను ప్రైవేట్ విద్యాసంస్థలలో చదివిస్తారు. దీంతో వారికి సరదా కరువైంది.



ఇంటిగ్రేటెడ్ పేరిట అనైతికం


ఇంటిగ్రేటెడ్ విద్యా విధానం పేరిట వేసవి సెలవులను ప్రైవేట్ విద్యాసంస్థలు హరించేశాయని, ఇది అనైతిక విధానమని విద్యాసంస్థల కూటమి ప్రధాన కార్యదర్శి శశికుమార్ మండిపడ్డారు. తల్లిదండ్రులు ఇందుకు కారకులేనని మండిపడ్డారు. ముందస్తుగా తెరుచుకునే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు యోగానంద తెలిపారు. ఇదే విషయమై బాలల హక్కుల కమిషన్ నాగణ్ణగౌడ అభిప్రాయం మేరకు వేసవి సెలవులను కుదించిన మేరకు వినతి వచ్చిందని తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పోటా పోటీగా నామినేషన్లు

బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లోని మూడు ఉపాధ్యాయ, మూడు పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించి పోటా పోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం ఏకంగా 21సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ఈశాన్య పట్టభద్రుల స్థానానికి 10సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 9మంది పురుషులు కాగా ఒకరు మహిళ ఉన్నారు. బెంగళూరు పట్టభద్రుల స్థానానికి ఇద్దరు, ఆగ్నేయ ఉపాధ్యాయ స్థానానికి ఒకటి, నైరుతి ఉపాధ్యాయ స్థానానికి మూడు, నైరుతి పట్టభద్రుల స్థానానికి రెండు, దక్షిణ ఉపాధ్యాయ స్థానానికి మూడు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. 15 మంది పురుషులు, ఒక మహిళ నామినేషన్ వేసినవారిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ముగ్గురు, స్వతంత్రులు 13 మంది నామినేషన్ వేశారు. కాగా ఇప్పటి వరకు 29 మంది నామినేషన్లు దాఖలు చేయగా, బీజేపీ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, జేడీఎస్ నుంచి ఒకరు, ఇండిపెండెంట్‌లు 20మంది ఉన్నారు.



నామినేషన్ వేస్తున్న బోజేగౌడ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.64	1,576.80
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	41	1129
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	13	201
సామర్థ్యం (టీఎంసీలు)	3.43	2.83

ఘనంగా భగీరథ జయంతి



జయంత్యుత్సవాల్లో పాల్గొన్న నాయకులు, సిబ్బంది

బళ్లారి సిటీ, మే 14: నగరంలోని కల్చరల్ కాంప్లెక్స్ హాల్లో మంగళవారం జిల్లా కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున శ్రీ భగీరథ మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి లాంచనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకుడ నాగరాజు, అటవీ శాఖ సిబ్బంది, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భగీరథుని పట్టుదలతోనే గంగావతరణ

సిరుగుప్ప, మే 14: భగీరథుని పట్టుదల వల్లనే గంగ భూమికి వచ్చిందని, ప్రతిఒక్కరూ ఆయన గురించి తెలుసుకోవాలని డిప్యూటీతాహసిల్దార్ రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం సిరుగుప్ప తాహసిల్దార్ కార్యాలయంలో భగీరథ జయంతి వేడుకలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి శేక్షావలి, విలేజ్ అకౌంటెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులపై భారం తగ్గించేది మంత్రసానులే



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రసానులు, ఆరోగ్య సిబ్బంది

గంగవతి రూరల్, మే 14: వైద్యులపై భారాన్ని తగ్గించడంలో మంత్రసానుల పాత్ర గొప్పదని గంగావతి జిల్లా వైద్యాధికారి లింగరాజు అన్నారు. గంగావతి నగరంలోని ప్రభుత్వ సబ్‌డివిజన్ ఆసుపత్రిలోని ఆడిటోరియంలో మంగళవారం అంతర్జాతీయ మంత్రసానుల దినోత్సవాలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమం ప్రతి సంవత్సరం మే 12న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంలో ఆసుపత్రిలోని ఆరోగ్య సిబ్బంది, మంత్రసానులు పాల్గొన్నారు.

ఘనంగా నూర్ మహ్మద్ ఖాద్రి ఉరుసు



నూర్‌మహ్మద్ ఖాద్రిని దర్శించుకుంటున్న భక్తులు

సిరుగుప్ప,మే 14: సిరుగుప్పలో మంగళవారం ఘనంగా నూర్ మహ్మద్ ఖాద్రి ఉరుసు జరిగింది. సిరుగుప్ప పట్టణం 1వ వార్డులోని నూర్ మహ్మద్ ఖాద్రి ఉరుసు సందర్భంగా మూడురోజులపాటు గంధం ఉరుసు, జియారత్ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు మహ్మద్ ఖాద్రికి పూలమాలలు వేసి దర్శించుకున్నారు. తదనంతరం కవాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహ్మద్ షఫీ, అనిల్‌సాబ్, అబ్దుల్లా, తదితర భక్తులు పాల్గొన్నారు.

పోలీసులకు అవమానం

పావగడ, మే 14: ఈనెల 13న జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర ప్రభుత్వ నాయకులు, అధికారులు కర్ణాటక నుండి బందోబస్తు కోసం వెళ్లిన పోలీసులకు అవమానకరమైన రీతిలో నడుచుకొన్నట్లు కొందరు పోలీసులు అసహనం వ్యక్తం చేశారు. బెంగళూరు నుండి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాకు బందోబస్తు కోసం వెళ్లిన పోలీసు సిబ్బందికి పశువులను తరలించే ట్రక్కులో రూట్ పరిశీలనకు పంపారు. దీనిపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఎంతటి త్యాగానికైనా సిద్ధమయ్యే పోలీసు వ్యవస్థపై ఇలాంటి చిన్నచూపు చూడటం దారుణమైన విషయమని పోలీసులు అసహనం వ్యక్తం చేశారు.

ఏరువాకకు వేళాయె!

● పలకరించిన తొలకరి చినుకులు

● దుక్కి దున్నేందుకు సిద్ధమైన రైతాంగం



మెట్ట చేలో దుక్కిదున్నుతున్న రైతు

బళ్లారి, మే 14(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఎన్నికలు ముగిశాయి. అంతలోనే తొలకరి వర్షాలు పలకరించాయి. భారీ వానలు కురవక పోయినా అక్కడక్కడా ఓ మోస్తరు వానలు కురిసాయి. మరి కొన్ని చోట్ల తేలిక పాటి జల్లులు కురిసాయి. దీంతో రైతు కుటుంబాలన్నీ పొలంబాట పట్టాయి. రైతన్నలు ఇక ఖరీఫ్ సాగు ప్రారంభించారు. బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు, చిత్రదుర్గం తదితర జిల్లాల్లో వర్షాధారం కింద పంటలు సాగుచేసే రైతులు ఖరీఫ్ సాగుకు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు.

బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయ నగర జిల్లాలో వర్షాధారం కింద లక్షలాది హెక్టార్ల పంట భూములున్నాయి. బళ్లారి జిల్లాలో 31వేల హెక్టార్లు, విజయనగరలో 41వేల హెక్టార్లు, కొప్పళ జిల్లాలో 29 వేల హెక్టార్లు, చిత్రదుర్గలో 52 వేల హెక్టార్లు, రాయచూరు జిల్లాలో 20వేల హెక్టార్లు భూమి వర్షాధారం కింద రైతులు సాగు చేస్తారని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు.

2023 ఏడాది ఖరీఫ్‌లో వర్షాలు కురవలేదు, దీంతో రైతులు చాలా వరకూ పంటలు సాగు చేయలేదు అరకొర సాగు చేసినా వర్షం లేక పంట చేతికి అందకుండా పోయింది. కొందరు పంటను పొలాల్లోనే పశువులకు, మేకలు, గొర్రెలకు వదిలేశారు. ప్రభుత్వం పంటనష్టం అంచనాలు వేసింది కానీ ఇంత వరకూ పరిహారం పంపిణీ చేయలేదు, గతం చేసిన గాయాన్ని రైతులు దిగుమింగుకుని ప్రస్తుత ఏడాది ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం పిచ్చిమొక్కలు తొలగించి భూమిని దుక్కిదున్నుకుంటున్నారు. చాలాచోట్ల ట్రాక్టర్ల ద్వారానే పొలం పనులు జరుగుతున్నాయి.

నిన్నమొన్నటి వరకూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ సేద్యం చేసిన రైతులు ప్రస్తుతం పొలం బాట పట్టారు. ఈఏడాది అయినా వానలు కురిసి పంటలు లాభసాటిగా చేతికి వస్తాయనే నమ్మకంతో పొలంలో సాగుకు దిగుతున్నామని సిరుగుప్ప, హగరిబొమ్మనహళ్, హువ్వినఅడగలి రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు మాత్రం ప్రస్తుతం తేలికపాటి జల్లులకు భూమి తడిసిందని, ముందుస్తుగానే దుక్కి దున్నితే మంచిదని, ఇందువలన నేలలో దాగిన క్రిమికీటకాదులు నశిస్తాయని చెబుతున్నారు.

వైభవంగా సోమనాథేశ్వరస్వామి రథోత్సవం



కన్నుల పండువగా సాగుతున్న సోమనాథేశ్వర స్వామి రథోత్సవం

కంప్లి, మే 14: కంప్లి పట్టణంలో ప్రసిద్ద చెందిన సోమనాథేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రథోత్సవం వైభవంగా జరిగింది. వైశాఖ శుద్ధ సప్తమి సందర్భంగా జరిగే ఈ రథోత్సవానికి ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి జలాభిషేకం, పాలాభిషేకం, వివిధ హోమాలు, జరిపారు. పూజల్లో కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పాల్గొన్నారు. కంప్లి పట్టణ భక్తులతో పాటు వివిధ గ్రామాల నుండి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం రథోత్సవం జరిగింది. భక్తులు ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకూ రథాన్ని లాగారు. వేలాది మంది భక్తుల 'హరహర మహదేవ' అనే శరణుఘోషతో ఆలయం మార్మోగింది.

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలి



డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ(ఎంఎల్)నాయకులు

రాయచూరు, మే 14 : జిల్లాలో ఏటా ప్రైవేటు విద్యసంస్థలు తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేయకుండా నియంత్రించాలని సీపీఐ(ఎంఎల్) పార్టీ నాయకులు కోరారు. జిల్లాధికారి ద్వారా ఈ మేరకు మంగళవారం వారు రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ విద్యసంవత్సరంలో ఫీజులను 15 శాతం పెంచాలని ప్రభుత్వానికి విన్నవించగా కొన్ని విద్యసంస్థల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ప్రైవేటు విద్యసంస్థల్లో ఫీజులను నిర్ధారించే అధికారం ప్రభుత్వాలకు లేదని చెప్పడం శోచనీయమన్నారు. ఈ క్రమంలో ప్రైవేటు విద్యసంస్థలు మరింత ఫీజులను పెంచి తల్లిదండ్రులను దోచేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే విద్యసంస్థల యాజమాన్యాలతో చర్చలు జరిపి పరిష్కారం చూపాలన్నారు. కాగా అదే సందర్భంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను పెంచి పేద మధ్యతరగతి పిల్లలకు ఉచితంగా విద్యనందించే ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఈ విషయంలో వెంటనే ప్రభుత్వం కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు.

కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు

● అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేరా



అదనపు జిల్లాకలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్నఏఐటీయూసీ సభ్యులు

బళ్లారి సిటీ, మే 14: జిందాల్లో జరిగిన ఇంజనీర్ల మరణాల దృష్ట్యా కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటామని అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా అన్నారు. ఏఐయూటీయూసీ బళ్లారి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికశాఖ మంత్రికి మంగళవారం అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా ద్వారా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జుబేరా మాట్లాడుతూ, జిందాల్ కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికుల జీవన భద్రతకు సంబంధించి తగిన చర్యలు తీసుకుని వారికి న్యాయం కల్పిస్తామన్నారు.

ఈసందర్భంగా ఏఐయూటీయూసీ జిల్లా అధ్యక్షులు దేవదాస్ మాట్లాడుతూ ఇది చాలా దిగ్భ్రాంతికరమైన సంఘటన, అని, యువ ఇంజనీర్ల విషాద మరణానికి ఏఐయూటీయూసీ ప్రగాఢ సంతాపం తెలిపిందన్నారు. ఇది కేవలం ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటన కాదని, జిందాల్ సంస్థ తమ ఉద్యోగుల భద్రత పట్ల చూపుతున్న నిర్లక్ష్యానికి తార్కాణమన్నారు. దీంతో ఆధారం కోల్పోయిన ముగ్గురు మృతిచెందిన ఇంజినీర్ల కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయన్నారు.. ఇలాంటి మరణాలు జరగడం ఇదే మొదటి సారికాదని, జిందాల్ సంస్థ కోసం అహోరాత్రులు శ్రమిస్తున్న ఉద్యోగులు, కార్మికుల ప్రాణాలు వెలకట్టలేనివన్నారు. జిల్లాకార్యదర్శి డాక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ జిందాల్ సంస్థ ఉద్యోగులు, కార్మికుల భద్రతను ఏనాడూ సీరియస్‌గా తీసుకోలేదని, భద్రత కల్పించాల్సిన సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో కార్మికుల భద్రతకు కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు తగిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిందాల్‌లో ఇటీవల జరిగిన దుర్ఘటనపై నిష్పాక్షిక విచారణ జరగాలన్నారు. భద్రతా చర్యలు పాటించని సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా జిల్లాఉపాధ్యక్షురాలు శాంత, శర్మ,మురళీకృష్ణ,చేతన్ జయరాం,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రసాయనాలతో మగ్గిన మామిడి పండ్ల స్వాధీనం



మామిడిపండ్ల గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

హోసూరు(కృష్ణగిరి), మే 14: కృష్ణగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం కృష్ణగిరిలో తనిఖీలు నిర్వహించారు. మామిడి కాయలను రసాయనాల ద్వారా కృత్రిమంగా పక్వానికి వచ్చేలా చేస్తున్నట్టు గుర్తించారు. కాల్షియంకార్బైడ్ రాళ్లతో కృత్రిమంగా పక్వానికి తెచ్చేలా చేస్తున్నట్టు నిర్ధారించి సుమారు 86 కిలోల మామిడిపండ్లను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్టు ఆహార భద్రతా విభాగం జిల్లా అధికారి డాక్టర్ జె.వెంకటేశ్ తెలిపారు.

కృష్ణగిరి జిల్లాలో మామిడి, పనస, బొప్పాయి, అరటి, సపోటా వంటివాటిని కూరగాయలు, పండ్లను కాల్షియం కార్బైడ్ రాళ్లతోను, రసాయనాలు చల్లడం ద్వారా మాగేలా చేస్తున్నారని గుర్తించారు. కృత్రిమంగా పక్వానికి తేవడం వల్ల జీర్ణకోశ నొప్పి, విపరీతమైన తలనొప్పి, తల తిరగడం, వాంతులు, విరేచనాలు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు సహజసిద్ధంగా పక్వానికి తెచ్చిన, సురక్షితమైన నాణ్యమైన కూరగాయలు, పండ్లను విక్రయించాలని కలెక్టర్ కె.ఎం.సరయు కోరారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



ఆరాధనోత్సవంలో పాల్గొన్న భక్తులు

బళ్లారి రూరల్, మే 14: బళ్లారి నగరం బెంగళూరు రోడ్డులో ఉండే పాత బ్రూస్పేట్ సమీపంలో గల గణేష్ దేవస్థానంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 41వ ఆరాధన వైభవంగా జరిగింది. మంగళవారం నుండి శనివారం వరకూ ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ ఆరాధనలో ఆంధ్రప్రదేశ్ కడప జిల్లా ప్రొద్దుటూరు వాసి అయిన లక్ష్మీకుమారి భాగవతారిణి పోతులూరు జీవిత చరిత్ర వివరిస్తారన్నారు. శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని నగరంలో ఊరేగించనున్నట్టు తెలిపారు.

పరిహారం కోసం రైతుల నిరసన



కుడితినిలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కంప్లి, మే 14: పరిశ్రమల పేరుతో భూములు తీసుకుని రైతులకు పరిహారం ఇవ్వని కారణంగా కుడితిని పట్టణంలో అరుగుణిడోనే, జాలికుంటే, కొలగల్లు, వేణీవీరాపురం, సిద్ధమన్నహళ్లి, కుడితిన్న గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన రైతులు నిరసన చేపట్టారు. నిరంతరం సాగుతున్న ఈ నిరసన కార్యక్రమంలో ఇంత వరకూ తమను అధికారులు, కర్మాగార యాజమాన్యం, ప్రజాప్రతినిధులు ఎవరూ పలకరించిన పాపాన పోలేదని రైతులు అంజినప్ప, జంగిలీసాబ్, తిప్పేస్వామి, పొంపన్న ఆవేదన వ్యక్తంచేశారు. త్వరలోనే సమస్యపరిష్కారం కోసం బెంగళూరులోని విధానసభ ఎదుట నిరసన వ్యక్తం చేస్తామని పేర్కొన్నారు. నాగప్ప, మంజునాథ్, హనుమంతప్ప, దస్తగిరి, విరేష్, శివన్న, యల్లప్ప, గడ్డిబసప్ప తదితర రైతులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో డ్రీమ్ వరల్డ్ ప్రతిభ



ద్యుతి దత్తాత్రేయ | సంకీర్త బోత్ర | శ్రీహిత | విజ్రుంభ్

బళ్లారి సిటీ, మే 14: సీబీఎస్ఈ బోర్డు ఎగ్జామ్స్‌లో డ్రీమ్ వరల్డ్ స్కూల్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. స్కూల్ యజమాన్యం. బోధనా సిబ్బంది కృషి వల్ల ఈ ఫలితాలు సాధించామని విద్యార్థులు తెలిపారు. సంకీత్ బోత్ర- 97శాతం, శ్రీహిత 96శాతం, ద్యుతి దత్తాత్రేయ భట్-94శాతం,విజ్రుంభ్-93 శాతం మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం అభినందించింది.

హోసూరు జోన్

వైభవంగా కోటమారియమ్మ ఉత్సవం



శూలాలు గుచ్చుకుని మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

హోసూరు, మే 14: హోసూరు రాంనగర్‌లో ప్రసిద్ధిచెందిన కోటమారియమ్మ ఆలయ ఉత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటూ శూలాలు గుచ్చుకుని ఊరేగింపుగా వెళ్లారు. భక్తులు కుటుంబ సమేతంగా చలిపిండి దీపాలు తీసుకుని అమ్మవారికి దీపారాధన చేస్తూ అమ్మవారి వేషాధారణ చేస్తూ ఊరేగింపుగా వచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పాల బిందెలు తీసుకుని సోమవారం రాత్రి నుంచే అమ్మవారిని దర్శించుకుంటారు. వీపు వెనుక భాగంల్లో శూలాలు గుచ్చుకుని క్రేన్‌కు వాలాడుతూ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్తుంటారు. ఈ పండుగను పురష్కరించుకుని నగరంల్లోని వివిధ అమ్మవార్ల ఆలయానికి కూడా భక్తులు సందర్శించి పూజలు చేశారు. ప్రజలు వారి వారి కోర్కెల మేరకు ఇష్టానుసారం టాటా ఏస్‌లు, ఆటోలు, కార్లు వంటి వాహనాల్లో వీపుకు శూలాలు గుచ్చుకుని ముందుకు సాగారు. హోసూరు డీఎస్పీ బాబు ప్రశాంత్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నగరమంగా బందోబస్తులో నిమగ్నమయ్యారు. అలాగే నగరంలోని ఎంజీ రోడ్డు, నేతాజీ రోడ్డు, బాగలూరు రోడ్డు, డెంకణీకోట రోడ్డు, ప్రాంతాల్లోని ప్రధాన రహదారులను వాహనాలను వెళ్లనీయకుండా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వాహనాలను లాగుతున్న భక్తులకు, ఎటువంటి ఆటంకలు ఏర్పడకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

టిప్పర్ ఢీకొని వ్యాపారి మృతి

హోసూరు(క్రైం), మే 14: హోసూరు తాలూకా తిమ్మచంద్రంకు చెందిన సీన్నప్ప(45) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా టిప్పర్ లారీ ఢీ కొని మృతి చెందాడు. అతడు సోమవారం రాత్రి కదిరేపల్లి పేరండపల్లి రోడ్డులో మునీశ్వర స్వామి దేవాలయం వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ, ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ప్రమాదంలో సీనప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. హడ్కో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుక

రాయచూరు, మే 14 : ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రవిశంకర్ గురుజి జన్మదినాన్ని సంస్థ ప్రతినిధులు రాయచూరులో ఘనంగా నిర్వహించారు. మంగళవారం నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామకృష్ణ వివేకానంద సంస్థ కన్వీనర్ వేణుగోపాల్ మాట్లాడుతూ దైవం దృష్టిలో అందరూ సమానులేనని పేద ధనిక అన్న భేదమే లేదని ఉద్ఘాటించారు. ఉన్నంతలో తృప్తిపడకుండా లేనిదాని కోసం ఆరాటపడడంతోనే జీవితంలో ఒత్తిడులు, సమస్యలు తలెత్తుతున్నాయని వాటిని జయించడమే లక్ష్యంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వేలాదిమందికి శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నిరాశ్రయులకు పాలు,పండ్లు పంపిణీ చేశారు.



నిరాశ్రయులకు పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

మహనీయుల తత్వాలతోనే మానవత్వం



భగీరథుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సమాజ ప్రముఖులు

రాయచూరు, మే14: జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ, కన్నడ సాంస్కృతిక శాఖ, జిల్లా ఉప్పార సమాజం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక రంగమందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని గ్రేడ్-2 తహసీల్దార్ మీర్ అన్వర్ ప్రారంభించి మాట్లాడారు. మహనీయుల తత్వాలను బోధన, ఆచరణలోకి తేవడం ద్వారా మానవీయ విలువలకు మన్నన పెంచాలన్నారు. భగీరథ మహర్షి చరిత్ర ఎంతో ఉందన్నారు. భగీరథుడు ఘోరతపస్సును చేసి దివి నుండి భూమికి గంగను తెచ్చిన ఘనత ఆయనదన్నారు. భగీరథ మహర్షి తత్వ బలాన్ని నేటి తరం యువత స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప్పార సమాజం అధ్యక్షుడు పాగుంటప్ప మిర్జాపూర్, యాజీ అధ్యక్షుడు యు.వెంకోబ, కార్యదర్శి చంద్రశేఖర్, మహిళా శాఖ అధ్యక్షురాలు పి.సురేఖా, యువ శాఖ అధ్యక్షుడు జూకూరు శ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాస్, మాలతి తదితరులు పాల్గొన్నారు.



బోల్తాపడిన రేషన్ బియ్యం లారీ

రేషన్ బియ్యం లారీ బోల్తా

రాయచూరు, మే 14: పేదలకు రేషన్ దుకాణాల ద్వారా అందించే అన్నభాగ్య పథకానికి సంబంధించిన బియ్యాన్ని తీసుకెళుతున్న లారీ ఒకటి మంగళవారం మాన్వి తాలూకా హిరేకొట్నికల్ సమీపంలో బోల్తాగొట్టింది. అధిక లోడ్‌తో ఉన్న ఈ లారీ అతీవేగంగా వెళుతుండడం వల్లే అదుపుతప్పి ప్రమాదం జరిగినట్లు అధికారులు గుర్తించారు. కాగా లారీ బోల్తాగొట్టిన అనంతరం బియ్యం సంచులు చెల్లాచదురుగా పడిపోయినా గంటన్నరకు పైగా సంబంధిత శాఖ అధికారులేవ్వరు అక్కడికి తిరిగి చూసే ప్రయత్నం కూడా చేయలేదని స్థానికులు ఆరోపించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సర్ ఆర్థర్ కాటన్ (జయంతి)



బ్రిటీష్ సైనికాధికారి, జనరల్ సర్ ఆర్థర్ థామస్ కాటన్ 1803 మే 15న జన్మించారు. ఇరిగేషన్ ఇంజనీర్‌గా నీటిపారుదలశాఖకు అనుబంధంగా కాలువలు, బ్రిడ్జ్‌లు నిర్మించారు. ఈస్ట్ ఇండియా కంపెనీలో మద్రాస్‌లో చేరి ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో గోదావరికి అనుబంధంగా ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి లక్షలాది ఎకరాలకు గోదావరి నీరు అందేలా చేసి 'కాటన్ దొర'గా నేటికీ పిలవబడుతున్నారు. కృష్ణానదిపై విజయవాడ వద్ద ఆనకట్ట నిర్మాణం ఆయన ప్రోద్బలంతోనే నిర్మించారు. ఆయన స్మారకార్థం ప్రభుత్వం మ్యూజియం ఏర్పాటు చేసింది. 1899 జూలై 24న కన్నుమూశారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ రోడ్డుకు అనుబంధంగా ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు.

వింజమూరి శివరామరావు (జయంతి)



వింజమూరి శివరామరావు 1908 మే 15న పిఠాపురం తాలూకా చంద్రపాళెంలో జన్మించారు. అభ్యుదయ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆయన మేనమామ. కలంపేరు 'గౌతమి'. పద్యాలను, గేయాలను సమప్రతిభతో రాయగల నేర్పరి. ఆకాశవాణిలో రెండు దశాబ్దాలపాటు స్క్రిప్ట్ రైటరుగా పనిచేశారు. లలితగీతాలు, రూపకాలను రాసి ప్రసారం చేశారు. 600 రేడియో నాటికలు రాశారు. 'కల్పవల్లి' ఖండకావ్య సంపుటి ఎంతో పేరొందింది. అనువాద రచనలోనూ సమర్థులు. 1982లో కన్నుమూశారు.

భైరాన్‌సింగ్ షెకావత్ (వర్ధంతి)



దేశ 11వ ఉపరాష్ట్రపతిగా వ్యవహరించిన 'పద్మభూషణ్' గ్రహీత భైరాన్‌సింగ్ షెకావత్ 1925 అక్టోబరు 23న రాజస్థాన్ రాష్ట్రం సికార్ జిల్లాలో జన్మించారు. బీజేపీలో కీలక నేత. రాజస్థాన్‌కు 1977 నుంచి మూడు సార్లు ముఖ్యమంత్రిగా కొనసాగారు. 2002 నుంచి 2007వరకు ఉపరాష్ట్రపతిగా కొనసాగారు. తొలుత సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కొంతకాలం పనిచేశాక పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. ఎమ్మెల్యేగా, ప్రతిపక్షనేతగా, రాజ్యసభ సభ్యుడిగా, ముఖ్యమంత్రిగా, అత్యున్నత ఉపరాష్ట్రపతి ఇలా వివిధ హోదాలలో కొనసాగారు. పేదరిక నిర్మూలనకోసం ఉద్దేశించిన 'అంత్యోదయ పథకం' ఆయన హయాంలో ప్రవేశ పెట్టినదే. 2010 మే 15న కన్నుమూశారు.

నగ్నముని (పుట్టినరోజు)



'నగ్నముని' అసలు పేరు మానేపల్లి హృషీకేశవరావు. గుంటూరు జిల్లా తెనాలిలో 1940 మే 15న జన్మించారు. 1958 నుంచి 1998 వరకు 40ఏళ్లపాటు అసెంబ్లీలో అవిచ్ఛిన్నంగా వివిధ ఉన్నత పదవులను నిర్వహించిన ఏకైక శాసనసభ ఉద్యోగి హృషీకేశవరావు మాత్రమే. దీర్ఘ కవితలు, జమ్మిచెట్టు, అద్వైతరాజ్యం తదితర రచనలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. చెరబండరాజు, మహాస్వప్న, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, భైరవయ్యలతో పాటు నగ్నముని సహా ఆరుగురు కవులు సాహితీ చరిత్రలో దిగంబరకవులుగా పేరొందారు. నటుడు, నాటకకర్త, ప్రయోక్తగా వ్యవహరించారు. 'కొయ్యగుర్రం' రచన మహాకావ్యంగా పేరొంది ఆంగ్ల, హిందీ, పంజాబీ, కన్నడ, తమిళ, రష్యన్ భాషలలోకి అనువాదమైంది. 'కళారత్న' పురస్కారం ఇతర అవార్డులు అందుకున్నారు.

మాధురి దీక్షిత్ (పుట్టినరోజు)



ప్రముఖ హిందీ నటి, 'పద్మశ్రీ' గ్రహీత మాధురి దీక్షిత్ 1967 మే 15న ముంబైలో మరాఠీ కుటుంబంలో జన్మించారు. వెండి తెరపై నటిగానే కాక సినీ నిర్మాత, బుల్లితెర పర్సనాలిటీగా రాణించారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకున్న నటీమణులలో ఒకరిగా నిలిచారు. 4 సార్లు ఉత్తమనటిగా నిలిచారు. 17సార్లు నామినేట్ కాగా 6 ఫిల్మ్‌ఫేర్ ఇతర పురస్కారాలు అందుకున్నారు. డ్యాన్స్ తదితర పలు కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అంతేకాక 'యునిసెఫ్' తరఫున బాలల హక్కులు, బాలకార్మిక వ్యవస్థపై పోరాటం చేశారు. ప్రొడక్షన్ కంపెనీ ఆర్ఎన్ఎం మూవింగ్ పిక్చర్స్ సహ సంస్థాకురాలు.

ఆండీ ముర్రే (పుట్టినరోజు)



బ్రిటీష్‌కు చెందిన టెన్నిస్ క్రీడాకారుడు 'సర్ ఆండీ బారెన్ ముర్రే 1987 మే 15న జన్మించారు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ)చే 41 వారాలపాటు వరల్డ్ నెంబరు 1గా నిలిచారు. 2016 రియో ఒలింపిక్స్‌లో రెండు గోల్డ్ మెడల్స్ ఇన్ సింగిల్స్ గెలుపొందారు. 3 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ సాధించగా ఇందులో రెండు వింబుల్డన్ పతకాలు ఉన్నాయి. ఇంతవరకు 46 ఏటీపీ సింగిల్స్ టైటిల్స్ సాధించగా ఇందులో 14 ఏటీపీ మాస్టర్స్ 1000 ఈవెంట్స్' ఉన్నాయి. పలు చారిటీ కార్యక్రమాలకుగాను 2014లో ఆర్థర్ ఆశె హ్యూమానిటేరియన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నారు. 2022 వింబుల్డన్ ఫైనల్స్‌లో నోవక్ డిజోకోవిక్‌ను ఎదుర్కొన్నారు. 2022లో థర్డ్‌క్లాస్ ఆఫ్ 'ఆర్డర్ ఆఫ్ మెరిట్' ఆఫ్ ఉక్రెయిన్‌ను గౌరవం పొందారు.

జూదరుల అరెస్టు

శిడ్లఘట్ట, మే 14: తాలూకాలోని అబ్లూడు గ్రామంలో పేకాట అడ్డాపై పోలీసులు మెరుపుదాడులు నిర్వహించి 8మందిని అరెస్టు చేశారు. పందేనికి ఉంచిన రూ.13,400 నగదు, 3 బైకులను స్వాధీనం చేసుకున్నారు. శిడ్లఘట్ట పట్టణానికి చెందిన ప్రభాకర్, అబ్లూడు గ్రామానికి చెందిన శివకుమార్, రవికుమార్, మూర్తి, అంబరీశ్, మంజునాథ్, చౌడప్ప, శివకుమార్‌ను అరెస్టు అయ్యారు. గోమాళ భూములలో అందర్‌బాహర్ ఆడు తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. శిడ్లఘట్ట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దయనీయంగా అనాథల బతుకు

బాగేపల్లి, మే 14: అనాథలు, వృద్ధుల జీవితాలకు విలువ లేదా..? వీరి దుస్థితి హీనంగా మారింది. పట్టించుకోవాల్సిన అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ శివారులోని జాతీయ రహదారి 44పై గ్రీన్‌పార్క్ సమీపాన చెత్తకుప్పల మధ్య ఒక అనాథ విశ్రాంతి తీసుకోవడం చర్చనీయాంశమైంది. పట్టణ, జాతీయ రహదారి 44పై ఆంధ్రప్రదేశ్ సరిహద్దు, గూళూరు రోడ్డు, చింతామణి రోడ్డు సహా పలు మార్గాలలో వందలాదిమంది అనాథలు రోడ్లపై చెత్తకుప్పల వద్ద, చెట్లకింద జీవనం సాగిస్తున్నారు. చెత్తకుప్పల్లో లభించే తినుబండారాలను తిని, లేదా ఎవరైనా పాదచారులు ఇచ్చే వాటిని తిని పొట్ట నింపుకుంటున్నారు. ఇటువంటి వృద్ధులు, అనాథల దుస్థితి చూస్తే సభ్యసమాజం తలదించుకోవాల్సిందే. పట్టణ శివారులోని గ్రీన్‌పార్క్ ఫ్యామిలీ డాబా ముందు చెత్తకుప్పలో తినుబండారాల వ్యర్థాలు, ప్లాస్టిక్ ఇతర చెత్తా చెదారం ఉంది. ఇలాంటి చోట ఒక అనాథ వృద్ధుడు ఏమీ పట్టనట్టు విశ్రాంతి తీసుకుం టున్నాడు. ఇదే మాదిరిగా నారేపల్లి టోల్‌ప్లాజా వద్ద మలుపులో మరొక అనాథ పగలు రాత్రి తేడా లేకుండా అక్కడే ఉంటున్నాడు.



డివైడర్ మధ్య ఇలా...



చెత్తకుప్పల నడుమ విశ్రాంతి తీసుకుంటూ..

పాతబట్టలు, మాసినగడ్డం, చేతికి దారాలు కట్టుకుని ఉన్నాడు. ఎవరైనా తినేందుకు ఇస్తే తీసు కుంటాడు. చలి, గాలి, వర్షం, ఎండ లెక్క చేయకుండా దయనీయ స్థితిలో జీవనం గడుపుతున్నారు. ఇలా ఎంతోమంది తమ కుటుంబాలను వదిలి ఇలా గడుపు తున్నారు. పట్టణంలోని డీవీజీ మెయిన్ రోడ్డు, డాక్టర్ హెచ్ఎన్ సర్కిల్, డాక్టర్ జచని రోడ్డు, బస్టాండ్, టీబీ క్రాస్ రోడ్డు పక్కన అనాథలు ఎక్కువగా ఉంటున్నారు. అయితే పురసభగానీ, సాంఘిక సంక్షేమ శాఖ గానీ, ఆరోగ్యశాఖ అధికారులుగానీ స్పందించి అనాథలకు పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తా చాటిన శ్రీచైతన్య



దయానిత, అనన్యశెట్టి, గరిమా ప్రకాష్, జై మదుగుండు, నిమిషా నాయక్

బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యారణ్యపురశాఖలో వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. సీబీఎస్ఈ బోర్డు ఫలితాలను సోమవారం ప్రకటించింది. కాగా 500కు గాను 493 మార్కులతో విద్యార్థిని దయానిత 98.6శాతంతో బెంగళూరు టాపర్‌గా నిలిచారన్నారు. అనన్యశెట్టి 486 (97.2), గరిమా ప్రకాష్ 482 (96.4), జై మదుగుండు 485 (97), నిమిషా నాయక్ 482 (96.4)శాతం సాధించి పాఠశాల ఖ్యాతిని చాటారన్నారు. విద్యారణ్యపురశాఖ పాఠశాలనుంచి 106మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొంటూ పాఠశాల ప్రిన్సిపల్ శశికళబాయి, అకడమిక్ డీన్ శ్రీధర్‌లు విద్యార్థులను అభినందించారు. కాగా కర్ణాటకలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల సీఈఓ సునీల్‌కుమార్, ఏజీఎం వంశీకృష్ణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ కృష్ణ కిశోర్‌లు ప్రత్యేకంగా అభినందించారు. 490 మార్కులపైన 21మంది, 480పైన 190మంది, 450పైన 893మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఏటా శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నారని కొనియాడారు.

కార్మికులు వ్యసనాలకు లోను కారాదు



కట్టడ కార్మిక సమాఖ్య ప్రారంభంలో ప్రముఖులు

బాగేపల్లి, మే 14: రోజంతా ఎంతో శ్రమించి పొందే కూలి మొత్తాన్ని దుర్వ్యసనాలకు ఖర్చు చేయరాదని సీనియర్ న్యాయవాది, న్యాయ సలహాదారుడు ఏజీ సుధాకర్ సూచించారు. పట్టణంలోని ద్వారకా ఫంక్షన్‌హాల్‌లో భాగ్యనగర కట్టడ కార్మికుల సమాఖ్య ప్రారంభం, మేడేను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ ప్రారంభించి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. కార్మికులు లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదన్నారు. మద్యం, గుట్కా వంటి వ్యసనాలతో జీవితాన్ని పాడుచేసుకోవద్దన్నారు. కష్టపడిన సంపాదనను చెడు అలవాట్లతో నాశనం చేసుకోవద్దని, పిల్లలను చక్కగా చదివించుకోవాలని, కుటుంబ నిర్వహణకు, మంచి పనులకు వినియోగించుకోవాలన్నారు. బాగేపల్లి సర్కిల్ కార్మిక అధికారి సతీశ్ మాట్లాడుతూ కట్టడ కార్మికులు ప్రభుత్వ సౌలభ్యాలు పొందేందుకు తప్పని సరిగా నమోదు చేసుకుని కార్మిక కార్డు పొందాలన్నారు. కార్మిక కుటుంబాలకు వైద్యం, విద్య, వివాహం తదితర సేవలు పొందేందుకు వీలవుతుందన్నారు. బాగేపల్లి సర్కిల్ పరిధిలో సుమారు 9వేలమంది కార్మికులు నమోదు చేసుకున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ కార్డులకు అవకాశం ఉండదన్నారు. ఒకవేళ అలాంటి నకిలీ కార్మిక కార్డులను గుర్తిస్తే వెంటనే రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర కట్టడ కార్మిక సమాఖ్య అధ్యక్షుడు శివకుమార్, ఉపాధ్యక్షుడు చిన్నప్పయ్య, గౌరవాధ్యక్షుడు సీఎస్ వెంకటేశ్, కార్యదర్శి నయాజ్, సంయుక్త కార్యదర్శి విశ్వనాథ్, సభ్యులు బషీర్, చలపతి, మూర్తి, మంజు, మహబూబ్‌బాషా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు తీర్చాలని.. కన్నబిడ్డనే విక్రయించిన తండ్రి

బంగారపేట, మే 14: అప్పు తీర్చాలని ఓ తండ్రి తన మూడు నెలల కుమారుడిని విక్రయించిన ఉదంతం కోలారు జిల్లా బంగారపేటలో వెలుగులోకి వచ్చింది. కుమారుడిని కిడ్నాప్ చేసి ఇతరులకు విక్రయించిన ఘటన బంగారపేట పట్టణంలోని కరెకూడి ప్రాంతంలో చోటు చేసుకుంది. సూలికుంటె గ్రామానికి చెందిన పవిత్రకు శ్రీనివాసపుర తాలూకా పునగూరకుంటె పరిధిలోని పందివారపల్లికి చెందిన మునిరాజుతో 8ఏళ్లక్రితం వివాహం జరిగింది. సుదీర్ఘకాలంగా వీరికి పిల్లలు కలగలేదు. 2023 జూన్ 21న పవిత్ర మగశిశువుకు జన్మ నిచ్చారు. బిడ్డకు మూడు నెలల వయసులో పవిత్ర అస్వస్థతకు లోను కావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ముక్కులో పైప్ అమరుస్తారు. కొన్ని రోజులపాటు ఆమె ఆసుపత్రిలోనే గడుపుతారు. ఆ తర్వాత కోలుకున్నాక నేరుగా పవిత్రను సొంతూరు పందివారపల్లిలో గృహ నిర్బంధం చేస్తాడు. భర్త మునిరాజుతోపాటు పక్కింటి వల్లీ కలసి తన బిడ్డను కిడ్నాప్ చేసి ఇతరులకు విక్రయించారని పోలీసులతోపాటు స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది. తన భర్త నుంచి బిడ్డను కాపాడాలని తల్లి వేడుకున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు, చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారులతో పవిత్ర

నీటి పొదుపుపై 18న వాకథాన్

మహదేవపుర, మే 14: నగరంలో నీటి ఎద్దడి పెరుగుతున్న నేపథ్యంలో నీటి పొదుపు ఆవశ్యకతను తెలిపేలా శాంతకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న రామమూర్తి నగర్‌లో వాకథాన్ జరగనుంది. ఫౌండేషన్ అధ్యక్షుడు శాంతకృష్ణమూర్తి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడే అంశం గురించి సుమారు ఐదుకిలోమీటర్ల వాకథాన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. వాకథాన్‌ను ఎమ్మెల్యే బైరతి బసవరాజ్, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ ప్రారంభిస్తారన్నారు. వర్షపునీటి సేకరణకోసం ఇంకుడుగుంతలు, ఇతరత్రా విధానాలను పెంపొందించుకోవడం ద్వారా భూగర్భజలాలు క్రమేపీ పెరుగుతా యన్నారు. వర్షకాలంలో నీటిని సేకరించుకునే పద్ధతులు అమలు చేసుకోవడం ద్వారా నీటి ఎద్దడి నియంత్రణ వీలవుతుందన్నారు. సమావేశంలో ఫౌండేషన్ సంస్థాపక సభ్యుడు కృష్ణ మూర్తి, ప్రముఖులు ఆనంద్, పృథ్వి, సుబ్రమణి, మైఖేల్, సతీశ్, హిరేగౌడ తదితరులు ఉన్నారు.



వాకథాన్ వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు

శిడ్లఘట్ట, మే 14: పట్టణంలోని ఉల్లూరుపేటలో కొలువైన వీరాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం పద్మశాలి కులస్థుల ఆధ్వర్యంలో భావనా మహర్షి, భద్రావతి దేవిలకు విశేషపూజలు నిర్వహించారు. ఆలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 9.15 గంటలకు వీరాంజనేయస్వామికి అభిషేకం, పుష్పాలంకరణ, 11.30 గంటలకు భావనా మహర్షి, భద్రావతి దేవిలకు పుష్పాలంకరణ, కులదేవర పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు కృష్ణమూర్తి, ఆయన కుమారులు ధార్మిక కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో ఆచరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తాలూకా పద్మశాలి సంఘం, పద్మాశాలి యువజన సేవాసంఘం సభ్యులు, మహిళా సేవా కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.





వీరాంజనేయస్వామి, భావనా మహర్షి, భద్రావతి దేవికి పూజలు

హైడెన్సిటీ కారిడార్ రోడ్డు పరిశీలన

మహదేవపుర, మే 14: నియోజకవర్గంలోని హోప్‌ఫామ్ సర్కిల్‌నుంచి కుందలహళ్లి జంక్షన్ వరకు సాగుతున్న హైడెన్సిటీ కారిడార్ రోడ్డు పనులను ఎమ్మెల్యే మంజులా, మాజీ మంత్రి అరవింద లింబావళి మంగళవారం పరిశీలించారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. పనులు మందగతిన సాగడంపై ఆరా తీశారు. సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. అదికారులకు పలు సలహా సూచనలు చేశారు. హైడెన్సిటీ కారిడార్, బీబీఎంపీ, జలమండలి, గెయిల్ గ్యాస్, బెస్కాం, కేఆర్‌డీసీఎల్ తదితర శాఖల అధికారులు, ఆర్‌కే మిశ్రా, బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహరరెడ్డి, గ్రామీణ అధ్యక్షుడు బీఎన్ నటరాజ్, ప్రముఖుడు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మంజుల

సక్రలో అత్యాధునిక వైద్య సదుపాయం

బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): సక్ర వరల్డ్ ఆసుపత్రిలో అత్యాధునిక నర్సింగ్ సిమ్యులేషన్ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చింది. బెంగళూరు అవుటర్ రింగ్‌రోడ్డులో సక్ర వరల్డ్ ఆసుపత్రిలో సరికొత్త సదుపాయం ఏర్పాటు చేశారు. ఆసుపత్రి గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ లోకేవేశ్ షను, ఫ్రెంచ్ ఫారిన్ ట్రేడ్ అడ్వైజర్ ఇన్ ఇండియా టెడ్డీ డుథెల్, ఓర్టెక్ గ్రూప్ హెడ్ రమోనా సిమియాన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నర్సింగ్ అన్ని సిమ్యులేటర్‌ను అందుబాటులోకి తెచ్చిన ఘనత ఆసుపత్రిదే అన్నారు. ఈ సదుపాయాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహించి చూపారు. గుణాత్మకమైన వైద్యం అందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.



ఆధునిక సదుపాయాన్ని ప్రయోగాత్మకంగా వివరిస్తూ...

రేపటి నుంచి వాసవీజయంత్యుత్సవాలు

శిడ్లఘట్ట, మే 14: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవి జయంతిని పురస్కరించుకుని మూడు రోజులపాటు విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 16న గురువారం స్వస్తివాచనం, కళశస్థాపన, పంచామృతా భిషేకం, సహస్ర నామార్చన, దేవీ సప్తశతి పారాయణ, మహా నైవేద్యం, విశేష అలంకరణ అనంతరం మహామంగళారతి, తీర్థప్రసాద వినియోగం జరగనుంది. 17న శుక్రవారం సుప్రభాత సేవ అనంతరం వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, దేవి సప్తశతి పారాయణ, మహానైవేద్యం, విశేష అలంకరణ కార్యక్రమాలు, ధూపదీప నైవేద్యం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. 18న శనివారం దశమిరోజున ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు కార్యక్రమాలు జరగనున్నాయి. కళశస్థాపన, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, తదుపరి సాయంత్రం అమ్మవారి పల్లకీ ఉత్సవం ఉంటాయని వాసవి సంఘం పాలనాధికారి రూపసి రమేశ్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

దొమ్మసంద్ర, మే 14: మానసిక అస్వస్థతకు గురైన వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దొమ్మసంద్ర గ్రామంలో చోటు చేసుకుంది. రమ్యా (30) మృతి చెందిన మహిళగా గుర్తించారు. నిరుద్యోగి అయిన భర్త శ్రీధర్ నిత్యం మద్యం తాగి వచ్చేవాడనితెలుస్తోంది. రెండేళ్ల కుమారుడిని పెంచడం కష్టంగా మారడంతో మానసిక వేదనకు గురైంది. ఆమెకు పుట్టింటివారు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు అందించినా ప్రయోజనం లేకపోయింది. ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సర్జాపుర సీఐ నవీన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

అరంగేట్రం చేసిన మాధవిశర్మ



నృత్యం చేస్తున్న మాధవీశర్మ

బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాట్య తరంగ సంస్థ డైరెక్టర్, పేరొందిన భరతనాట్య గురువు సముద్యాభట్ సారథ్యంలో భరతనాట్యం నేర్చుకున్న మాధవీశర్మ అరంగేట్రం చేశారు. జేఎస్ఎస్ ఆడిటోరియంలో 400మందికిపైగా ప్రేక్షకుల సమక్షంలో నాట్య గురువు, విద్వాన్ జనార్ధన్‌భట్, మాజీ జస్టిస్ ఎం కుమార్, గాయన సమాజ అధ్యక్షుడు డాక్టర్ ఎంఆర్‌వీ ప్రసాద్‌లు ముఖ్యులుగా పాల్గొన్న కార్యక్రమంలో మాధవిశర్మ అరంగేట్రం చేశారు. మూడు గంటలకుపైగా సుందరభావపూర్ణ నాట్య ప్రదర్శన ఇచ్చారు. ప్రముఖ మృదంగ విద్వాంసులు రవిశంకర్ శర్మ, శ్రీదేవిల కుమార్తె మాధవి అరంగేట్రంపై ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. 15ఏళ్లపాటు సాధన చేసినట్టు మాధవిశర్మ తెలిపారు.

మరమ్మతులకు నోచుకోని నీటి ట్యాంకు



ట్యాంక్ లేకుండా దర్శనమిస్తున్న సిమెంట్ దిమ్మె

రొద్దం, మే14 : మండలకేంద్రంలోని పాత ఎస్సీ కాలనీలో తాగునీటి అవసరాలకు టీడీపీ హయాంలో ట్యాంకు ఏర్పాటు చేశారు. సిమెంటు దిమ్మె కట్టి దానిపై సింథటిక్ ట్యాంకు ఏర్పాటు చేశారు. దానికి మూడు ది క్కులా కొళాయిలు అమర్చి కాలనీవాసులు నీళ్లు పట్టుకు నేందుకు ఏర్పాట్లు చేశారు. ఇది కాలనీ వాసులకు తాగు నీటి కొరత తీర్చేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చి నప్పటి నుంచి దాని నిర్వహణను వదిలేశారు. ట్యాంకుకు నీరు సరఫరా చేయలేదు. దీంతో కాలనీలో తాగునీటి సమస్య తలెత్తింది. అయినా పట్టించుకునే వారు లేరని కా లనీ వాసులు వాపోతున్నారు. నీరు సరఫరా చేయక పోవడంతో కొన్నాళ్లకు సింథటిక్ ట్యాంకు ఎండకు ఎండిపో యి పూర్తిగా పాడైపోయింది. ముక్కలై రాలిపోయింది. ప్రస్తుతం సిమెంటు దిమ్మె మాత్రం అక్కడ దర్శన మిస్తోంది. కొత్తట్యాంకు ఏర్పాటు చేసి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎన్ని మార్లు సర్పంచుకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని కాలనీ వాసు లు వాపోతున్నారు. టీడీపీ వారు చేపట్టిన అభివృద్ధి పనులను తామెందుకు కొనసాగించాలని గాలికి వదిలేసి నట్లుందని పలువురు విమర్శిస్తున్నారు. ఏదిఏమైనా కాలనీ వాసులు తాగునీటి సమస్య తీరలేదు.

నేటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మవరం, మే 14: పట్టణంలో ప్రసిద్ధి గాంచిన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఉత్సవాల వివరాలను ప్రకటించారు. 15న ధ్వజారోహణం, 16న ఉదయం సూర్యప్రభవాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 17న ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం సింహవాహనం, 18న ఉదయం కల్పవృక్షవాహ నం, సాయంత్రం హనుమద్‌వాహనం, 19న ఉదయం పల్లకీ ఉత్సవం, సాయంత్రం కల్యాణోత్సవం, 20న సాయంత్రం 3గంటలకు శేషవాహనంపై, రాత్రి 7గంటలకు గజవాహనంపై, 21న ఉదయం మరుగుతేరు(రథోత్సవం) ఉంటుందన్నారు. 22న సాయం త్రం అశ్వవాహనంపై, 23న ఉదయం పుష్పమండంపై, 10గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 6గంటలకు హంసవాహనం, 24న సాయంత్రం దేవతా ఉద్వాసన, 25న ఉదయం పుష్పయాగం, సాయంత్రం శయనోత్సవ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని వారు తెలిపారు.